ఈనాడు
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు
శనివారం అక్టోబరు 12, 2024

రావణ దహనం.. విజయ శోభితం







నెల్లూరులో తొలిసారిగా శరన్నవరాత్రి ఉత్సవాల్లో రావణ దహన కార్యక్రమాన్ని నిర్వహించి.. విజయదశమి పర్వదినానికి స్వాగతం పలికారు. దర్గామిట్టలోని రాజరాజేశ్వరీ దేవస్థానం వద్ద నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి బాణం సంధించి. . రావణుడి బొమ్మను దహనం చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై.. ఈ వేడుకను తిలకించారు. ఇక శుక్రవారం అమ్మవారు మహిషాసురమర్దినిగా భక్తులకు దర్శనమిచ్చారు. స్టోన్‌హౌస్‌పేటలోని కన్యకాపరమేశ్వరీ అమ్మవారు గజలక్ష్మి అలంకరణలో కొలువుదీరి అభయమిచ్చారు. మహర్నవమి పర్వదినాన్ని పురస్కరించుకుని భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయాలకు తరలివచ్చారు.

– న్యూస్‌టుడే, నెల్లూరు(సాంస్కృతికం)





రావణుడి దహనం.. విల్లు ఎక్కుపెడుతున్న నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి



రాజరాజేశ్వరి ఆలయంలో ఇరుముడులతో భక్తులు.. దహన ఘట్టాన్ని చరవాణుల్లో బంధిస్తున్న ప్రజలు

భారీగా ఎర్ర చందనం స్వాధీనం

తిరుపతి(మంగళం), న్యూస్‌టుడే: నెల్లూరు జిల్లా పరిధిలో ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బలగాలు నిర్వహించిన దాడుల్లో భారీగా ఎర్రచందనం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ, టాస్క్‌ఫోర్స్ ఇన్‌ఛార్జి సుబ్బరాయుడు తెలిపారు. తిరుపతి కపిలతీర్థంలోని కార్యాలయంలో శుక్రవారం టాస్క్‌ఫోర్స్ ఎస్పీ శ్రీనివాస్‌తో కలిసి ఆయన వివరాలు వెల్లడించారు. సోమశిల - అనంతసాగరం మార్గంలో రెండు కార్లలో ఎర్రచందనం దుంగలతో వస్తున్న అయిదుగురు స్మగ్లర్లను అరెస్ట్ చేసి, వారి నుంచి 95 ఎర్రచందనం దుంగలు, రెండు కార్లను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. నిందితులు తమిళనాడు, పుదుచ్చేరికి చెందిన వారని ఎస్పీ తెలిపారు.

నారీ శక్తి.. నవ చేతనా దీప్తి



మహిషాసురుడి బాధలు తొలగించినా.. కత్తి పట్టి పరాయి పాలనపై పోరాడినా.. వివిధ సామాజిక అంశాలపై సింహపురి గడ్డన గర్జించినా.. వెన్ను చూపని ధీశాలి మగువ.. అలనాడు ధీరోదాత్తంగా పోరాడిన వారి అడుగుజాడల్లో నడుస్తూ.. అన్నింటా రాణిస్తున్నారు ఆధునిక మహిళ. ఓ వైపు కుటుంబ బాధ్యతలు మోస్తూ.. మరోవైపు సేవల్లోనూ తరిస్తున్నారు. సామాజిక చైతన్యానికి దివిటీగా నిలుస్తున్నారు. విజయ దశమి సందర్భంగా కళల్లో రాణిస్తూ.. సేవలో తరిస్తున్న మహిళా మణులపై ప్రత్యేక కథన సమాహారం..

గ్రామస్థుల మదిలో నిలిచి...



సంగం: మాజీ ఎంపీ లగడపాటి రాజగోపాల్ తల్లి రామలక్ష్మమ్మ తన మెట్టినింటి కేంద్రంగా పేదలకు అండగా నిలుస్తున్నారు. తరుణవాయి పంచాయతీ అనుబంధ గ్రామం అమరపనాయుడి కండ్రికకకు చెందిన వెంకట్రామనాయుడి సతీమణి రామలక్ష్మమ్మ 2008 నుంచి సేవా కార్యక్రమాలు చేపట్టారు. సమీప వెంకటేశ్వరపురంతో పాటు పెరుమాళ్లపాడు, కరటంపాడు, సౌత్‌ఆములూరులో శుద్ధజలం అందిస్తున్నారు. అమరపనాయుడు కండ్రిక కేంద్రంగా సంచార వైద్యశాల నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం అక్కడే వృద్ధాశ్రమం నిర్వహిస్తున్నారు. మహాలక్ష్మమ్మ మాను వద్ద మందిరం, తరుణవాయి కూడలిలో బస్‌షెల్టరు నిర్మించారు.

కేసుల ఛేదనలో మేటి



నెల్లూరు(నేర విభాగం): జిల్లాలో మహిళా పోలీస్ అధికారంటే గుర్తుకొచ్చేది నాగేశ్వరమ్మ. 2004లో ఎస్సైగా ఎంపికైన ఆమె.. 2005లో వేదాయపాలెంలో పీఎస్సైగా బాధ్యతలు చేపట్టారు. అనంతరం కావలి రెండో పట్టణం, మహిళా పీఎస్‌లో పనిచేశారు. 2012లో సీఐగా ఉద్యోగోన్నతి పొంది.. దర్గామిట్ట, గూడూరు, ట్రాఫిక్, స్పెషల్ బ్రాంచ్, ట్రాన్స్‌కో విజిలెన్స్‌లో పనిచేశారు. ప్రస్తుతం పోలీసు శిక్షణ కేంద్రంలో విధులు నిర్వహిస్తున్నారు. సీఐగా దర్గామిట్ట పీఎస్‌లో ఉన్న సమయంలో బాలుడి అపహరణ కేసును గంటల వ్యవధిలో ఛేదించారు. రైలులో నగదు తీసుకెళ్తున్నట్టు అనుమానిత ఫోన్ వచ్చింది. నగదు పట్టుకోగా.. కేసు సంచలనం సృష్టించింది. విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ చూపి ఇప్పటి వరకు 50కి పైగా పురస్కారాలు అందుకున్నారు.

క్రీడా దేవిక



కోవూరు: పేద కుటుంబంలో జన్మించినా.. తండ్రి ప్రోత్సాహంతో క్రీడల్లో చక్కటి విజయాలు సాధిస్తూ ఎందరికో స్ఫూర్తిగా నిలుస్తున్నారు కోవూరు పట్టణంలోని జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయురాలు దేవిక. తండ్రి శిక్షణలోనే క్రీడల్లో రాటుతేలిన ఈమె.. ఇప్పుడు బాలికలను క్రీడల దిశగా ప్రోత్సహిస్తున్నారు. రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడాకారులుగా తీర్చిదిద్దారు. ప్రభుత్వంతో పాటు పలు స్వచ్ఛంద సంస్థల నుంచి పురస్కారాలు స్వీకరించారు.

డొక్కా సీతమ్మ బాటలో..



కావలి: అన్నదాన కార్యక్రమాల ద్వారా అందరితో శభాష్ అనిపించుకుంటున్నారు కావలి పట్టణానికి చెందిన సౌందర్య దీపిక. ఇప్పటి వరకు 700 అన్నదాన శిబిరాలు నిర్వహించారు. తల్లిదండ్రులు ఇచ్చే కొద్ది మొత్తాలతో పాటు మిత్రులు, బంధువుల నుంచి నిధులు సేకరించి ఆకలి తీర్చుతున్నారు. ప్రకృతి విపత్తుల సందర్భాల్లోనూ బాధితులకు అండగా నిలుస్తూ మన్ననలు పొందుతున్నారు.

మంజుల స్ఫూర్తి



చేజర్ల: సామాజిక అంశాలపై గ్రామీణుల్లో చైతన్యం నింపుతున్నారు మాముడూరుకు చెందిన యల్లాల మంజుల. పూర్వ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడును ఆదర్శంగా తీసుకుని 2018లో ధరణి సేవాసమితి ఏర్పాటు చేసిన ఈమె.. సంస్థ ఆధ్వర్యంలో 14 గ్రామాల్లో శుద్ధజల పథకాలు ఏర్పాటు చేయించారు. ఎస్వీయూ ఆచార్యులైన భర్త వెంకటరామిరెడ్డి ప్రోత్సాహంతో వనాల ఏర్పాటుకు కృషి చేస్తున్నారు.

ప్రపంచం మెచ్చిన కళ



ఉదయగిరి: చెక్క నగిషీలతో ప్రపంచ వ్యాప్త గుర్తింపు పొందారు. తమదైన కళా నైపుణ్యంతో ఏకంగా ప్రధాని మోదీ మెప్పు పొందారు పట్టణంలోని దిలావర్ భాయ్ వీధి మహిళలు.. ఇక్కడి ఉడ్ అండ్ కట్లర్ కేంద్రంలో కలివి, మద్ది, దేవదారు తదితర కలపతో చక్కనైన కళా రూపాలకు ప్రాణం పోస్తున్నారు. ఒకప్పుడు 15 మందితో ప్రారంభమైన ఈ పరిశ్రమ.. ఇప్పుడు 400 మందితో సాగుతోంది. వంట సామగ్రి, పిల్లలు ఆడుకునే బొమ్మలు, ఇతర అలంకరణ వస్తువులు 200 రకాల వరకు వీరి చేతుల్లో రూపుదిద్దుకుంటుండగా- ఇప్పటికే రెండు సార్లు రాష్ట్ర స్థాయి అవార్డులు, ఐఎస్ఐ ధ్రువపత్రం కూడా దక్కడం విశేషం.

సోమశిలకు 7,100 క్యూసెక్కుల వరద

అనంతసాగరం, న్యూస్‌టుడే: సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి వరద కొనసాగుతోంది. శుక్రవారం సాయంత్రం 7,100 క్యూసెక్కులు వస్తున్నట్లు ప్రాజెక్టు అధికారులు తెలిపారు. జలాశయంలో ప్రస్తుతం 317.461 అడుగుల నీటి మట్టం నమోదవగా... 52.350 టీఎంసీల నిల్వ ఉంది. పవర్ టన్నెల్ ద్వారా 1,950 క్యూసెక్కులు డెల్టాకు, నాన్ డెల్టాలైన ఉత్తర కాలువకు 540, దక్షిణ కాలువ ద్వారా కండలేరు వరద కాలువకు 8,500 క్యూసెక్కుల చొప్పున విడుదల చేస్తున్నారు.

పనితీరు మార్చుకోకుంటే చర్యలు తప్పవు

మెగా ప్రాజెక్టు యాజమాన్యం తీరుపై మంత్రి నారాయణ ఆగ్రహం



ప్లాంట్‌ను పరిశీలిస్తున్న మంత్రి నారాయణ

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), పొదలకూరు న్యూస్‌టుడే: పొదలకూరు మండలం మహ్మదాపురం వద్దనున్న మెగా వాటర్ ప్లాంట్‌ను శుక్రవారం రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి పొంగూరు నారాయణ ఆకస్మికంగా తనిఖీ చేశారు. గత మూడు రోజులుగా నగరానికి నీటి సరఫరా నిలిచిపోయిన విషయం తెలుసుకున్న ఆయన.. ప్లాంట్ మొత్తంగా పరిశీలించి, అధికారులతో మాట్లాడారు. మెగా ప్రాజెక్టు యాజమాన్యం తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. అధికారుల నిర్లిప్తతపై మండిపడ్డారు. ప్రాజెక్టు డైరెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడి.. పనితీరు మార్చుకోవాలని హెచ్చరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గత ప్రభుత్వ చేతగాని పాలనలో గాడి తప్పిన అభివృద్ధిని సరిచేసి.. రాష్ట్రాన్ని అన్ని విధాలా ముందుకు తీసుకువెళ్లేందుకు కాస్తంత సమయం ఇవ్వాలని ప్రజలను కోరారు. 2014-15 మధ్య తెదేపా ప్రభుత్వ హయాంలో నగరంలోని 88వేల ఇళ్లకు రూ. 550 కోట్లతో భూగర్భ మురుగు నీటి వ్యవస్థ, మరో రూ. 550 కోట్లతో స్వచ్ఛమైన తాగునీటి పథకానికి శ్రీకారం చుట్టామన్నారు. రానున్న 30 ఏళ్ల అవసరాలను దృష్టిలో ఉంచుకుని మహ్మదాపురం వద్ద పంపింగ్ సిస్టం డిజైన్ చేసినట్లు తెలిపారు. రెండు ట్రాన్స్‌ఫార్మర్లు, మూడు మోటార్లు ఏర్పాటు చేయగా.. అనివార్య కారణాలతో ఇక్కడ ట్రాన్స్‌ఫార్మర్ పేలడంతో పట్టణానికి తాగునీటి సరఫరా నిలిచిపోయిందన్నారు. గత ప్రభుత్వం బృహత్తర ప్రాజెక్టును గాలికి వదిలేసి.. తగిన భద్రతా చర్యలు చేపట్టలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మెగా కంపెనీతో మాట్లాడి.. వెనువెంటనే తాగునీటి సరఫరా అయ్యేలా చర్యలు చేపట్టామన్నారు. క్షేత్రస్థాయిలో నాయకులు, ఎమ్మెల్యేలు తిరిగితే సమస్య ఏమిటో ప్రభుత్వానికి తెలుస్తుందన్నారు. త్వరితగతిన భూగర్భ మురుగునీటి వ్యవస్థ, తాగునీటి పథకానికి సంబంధించిన మిగిలిన పనులు పూర్తి చేస్తామన్నారు.

రాత్రయితే.. రైట్ రైట్

రోజూ వెయ్యి టన్నులకుపైగా తెల్లరాయి అక్రమ తరలింపు

న్యూస్‌టుడే, సైదాపురం, తోటపల్లిగూడూరు

గత వైకాపా పాలనలో ప్రకృతి వనరులకు ఇష్టారాజ్యంగా కొల్లగొట్టారు.. అధికార దర్పంతో ఎలాంటి అనుమతి లేకుండా వందల కోట్ల రూపాయలు విలువ చేసే తెల్లరాయి ఖనిజాన్ని వివిధ ప్రాంతాలకు తరలించి సొమ్ము చేసుకున్నారు... ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో గత ప్రభుత్వంలో జరిగిన దందాపై విచారణకు ఆదేశించింది. ఈ క్రమంలో టైల్స్ తయారు చేసేందుకు అవసరమైన ఖనిజాన్ని తరలించుకునేందుకు ఒక మైకా గనికి అనుమతులు తెచ్చుకున్నట్లు సమాచారం. గత ప్రభుత్వ హయాంలో కొల్లగొట్టిన ఘనులే ఇటీవల సైదాపురం నుంచి రాత్రివేళల్లో అక్రమంగా తెల్లరాయిని వివిధ ప్రాంతాలకు తరలిస్తున్నారు. అధికారులు ప్రేక్షకపాత్ర వహిస్తున్నారని లీజులు పొంది అనుమతుల కోసం ఎదురుచూస్తున్న పలువురు గనుల యజమానులు ప్రశ్నిస్తున్నారు.

అధికారుల పర్యవేక్షణ లేక..

● అక్రమార్కులు రాత్రి వేళల్లో రోజూ పదుల సంఖ్యలో లారీలతో వేల టన్నుల ఖనిజాన్ని వివిధ ప్రాంతాల్లో తరలిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో కొల్లగొట్టిన వారే అక్రమాలకు పాల్పడుతున్నారని సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మండలంలోని జోగిపల్లి, జాపలాపురం, చాగణం, సైదాపురం, పొక్కందల, మొలకలపూండ్ల ప్రాంతాల నుంచి వారం రోజులుగా రాత్రి వేళల్లో ఖనిజ సంపద పదుల సంఖ్యలో లారీల్లో తరలిపోతోంది. అనుమతులు ఉన్న తమకు గనుల నుంచి ఖనిజాన్ని తరలించేకునేందుకు ప్రభుత్వం అనుమతి ఇవ్వలేదని, కొందరు ఒక గనికి అనుమతి తెచ్చుకొని ఇతర వాటిల్లో ఉన్నవి తరలిస్తున్నా ఎందుకు అధికారులు చర్యలు తీసుకోవడం లేదని పలువురు విమర్శిస్తున్నారు. సైదాపురం సమీపంలో పోలీసులు తెల్లరాయి తరలిస్తున్న టిప్పర్‌ను సీజ్ చేశారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టిసారించి ఖనిజాన్ని తరలించే లారీలను అడ్డుకుని చర్యలు చేపట్టాలని పలువురు విన్నవిస్తున్నారు.



మూతపడిన యార్డులో తెల్లరాయి తరలించేందుకు సిద్ధం చేస్తున్న కూలీలు

● సైదాపురం మండలంలోని తలుపూరు, కలిచేడు, జోగిపల్లి, గిద్దలూరు, ఊటుకూరు, మొలకలపూండ్ల, అనంతమడుగు, చాగణం ప్రాంతాల్లో భూగర్భంలో మైకా, పల్స్‌పర్, క్వార్ట్జ్, వర్మిక్యులేట్ లాంటి ఖనిజ సంపద నిక్షిప్తమైంది. వీటిని వెలికితీయాలంటే మైనింగ్ శాఖ నుంచి లీజుతో పాటు తరలించేందుకు రవాణా అనుమతులుండాలి. గనులు, యార్డుల్లో ఉన్న ఖనిజాన్ని కూలీలతో వాటిని సిద్ధం చేసి రాత్రి వేళల్లో అక్రమంగా తరలిస్తున్నారు.

నిఘా పెంచాం: ఎస్ఐ సైదాపురం ఎస్సై క్రాంతి కుమార్ మాట్లాడుతూ... రాత్రివేళల్లో తెల్లరాయి ఖనిజం అక్రమంగా తరలిస్తున్నారనే సమాచారంతో నిఘా ఉంచామన్నారు. తెల్లరాయి తరలిస్తున్న టిప్పర్‌ను స్వాధీనం చేసుకుని కేసునమోదు చేశామన్నారు. అనుమతులు లేకుండా తరలిస్తే సీజ్ చేస్తామన్నారు.

చివరి ఆయకట్టు వరకు సాగునీరందిస్తాం

లింగసముద్రం : రాళ్లపాడు జలాశయ పరిధిలో చివరి ఆయకట్టు వరకు నీరందిస్తామని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు అన్నారు. సోమశిల నుంచి విడుదల చేసిన నీరు శుక్రవారం ప్రాజెక్టుకు చేరడంతో జలాశయం వద్ద పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జలాశయం అభివృద్ధి పనులకు రూ.35 లక్షలు ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. అనంతరం కలిగిరి సమీపంలో నిర్మించిన కల్వర్టును పరిశీలించారు. ఆయన వెంట మండల తెదేపా అధ్యక్షుడు గోపాలరావు, నాయకులు రంగయ్య, సాంబయ్య, ఎం. రామారావు, మాల్యాద్రి, నాగేశ్వరరావు ప్రాజెక్టు అధికారులు ఉన్నారు.



ప్రాజెక్టు వద్ద పూజలు చేస్తున్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

In the Court of the IIIrd Addl. District Judge, Nellore
O.S. No. 102/2024

1. Dodla Radhaiah
2. Vanki Malleswari
3. Dodla Govindamma
4. Dodla Padmavathi
5. Dodla Srikanth ... Plaintiff's

Vs.

NIL ... Defendant

జనరల్ నోటీసు

పై దావాలోని 1వ వాది లేట్ Vijaya Kalaitzis Moundakis గారికి సోదరుడు మరియు 2వ వాదికి సోదరి, 3వ వాది మరదలు 4 మరియు 5, 3వ వాది పిల్లలు అయి ఉన్నారు. కావున లేట్ Vijaya Kalaitzis Moundakis గారు మరియు ఆమె భర్త అయిన Pavlos Efstratios Kalaitzis Moundakis Hairetis గార్లు మరణించినందున వారు పేరుతో ఉన్న ఆస్తికి పై వాదులను వారసులుగా నిర్ణయించమని పై వారి కోర్టులో దావా దాఖలు చేయగా తేది: 24-10-2024న వాయిదా వేసియున్నారు. కావున ఎవ్వరికైన ఏలాంటి ఆక్షేపణలు ఉన్న యెడల పై తేదిన ఉదయం 10.30 గంటలకు హాజరై ఆక్షేపణలు తెలుపుకొనవలసినది. లేని యెడల కేసు పరోక్షమున తీర్మానించబడును.

పి.ఎన్.వి. సాయికుమార్, B.A., LLB.,
వాదులు తరపు అడ్వకేటు, నెల్లూరు.

రైతుబజారులో తక్కువ ధరకు వంట నూనెలు: జేసీ

నెల్లూరు(కలెక్టరేట్), న్యూస్‌టుడే: నిత్యావసరాల ధరలు నియంత్రించేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు చేపట్టినట్లు జేసీ కె.కార్తీక్ తెలిపారు. శుక్రవారం నవాబుపేట రైతుబజారులో వినియోగదారులకు తక్కువ ధరకు వంట నూనెలు అందించే కేంద్రం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ వినియోగదారులకు నాణ్యమైన బీపీటీ రకం బియ్యం, కందిపప్పు, పామాయిల్, సన్‌ఫ్లవర్ ఆయిల్ తక్కువ ధరకు అందించేందుకు జిల్లాలో 18 ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. వీటి ద్వారా కందిపప్పు కేజీ రూ.150, బీపీటీ రకం స్టీమ్ బియ్యం కేజీ రూ.45, రా రైస్ కేజీ రూ.47తో పాటు పామాయిల్ లీటరు రూ.110, సన్‌ఫ్లవర్ ఆయిల్ లీటరు రూ.124కు విక్రయిస్తున్నట్లు తెలిపారు. ఒక్కో రేషన్ కార్డుపై మూడు లీటర్ల పామాయిల్, లీటరు సన్‌ఫ్లవర్ ఇస్తున్నట్లు వివరించారు. టమోటాలు కేజీ రూ.42, ఉల్లిపాయలు కేజీ రూ.32కు అందిస్తున్నామని, ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఎస్‌వో వెంకటరమణ, మార్కెటింగ్‌శాఖ ఏడీ అనిత, సివిల్ సప్లయ్స్ కార్పొరేషన్ డైరెక్టర్ పట్టాభిరామిరెడ్డి పాల్గొన్నారు.



మహిళకు నూనె ప్యాకెట్ అందిస్తున్న జేసీ కార్తీక్

కావలి

•కావలి • ఉదయగిరి • కందుకూరు

అక్కడే..పదే పదే !



పట్టణంలోని ఎన్టీఆర్ విగ్రహం కూడలిలో తాగునీటి పైపులైన్‌కు పదే పదే లీకులు ఏర్పడుతున్నాయి. వీటిని పరిష్కరించడంలో ఇంజినీరింగ్ విభాగం అధికారులు విఫలమవుతున్నారు. పురపాలక కమిషనర్ శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ పాత పైపులు కావడంతో లీకుల బెడద వెంటాడుతుందన్నారు. భవిష్యత్తులో ఈ సమస్య ఉత్పన్నం కాకుండా చూస్తామని వివరించారు. – న్యూస్‌టుడే, కావలి

తపాలా సేవలు పొందుదాం

గుడ్లూరు: తపాలా శాఖ అందించే సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎస్సై వెంకట్రావు అన్నారు. శుక్రవారం బస్టాండు కూడలిలో జనంలోకి మనం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎస్పీఎం వెంకటేశ్వరరావు, ఎంవో వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వనిత..ఘనత

పట్టణంలోని పలువురు మహిళలు అలనాటి గొప్ప వనితలను ఆదర్శంగా తీసుకున్నారు. సామాజికాంశాలపై ప్రజలను చైతన్యం చేస్తున్నారు. ఈ క్రతువులో కొందరు పేదల ఆకలి తీరుస్తున్నారు. మరికొందరు ప్రాణాపాయంలో ఉన్న వారికి రక్తమిచ్చి ఆదుకుంటున్నారు. ఇంకొందరు వ్యక్తిగతంగా ప్రతిభ చాటుతున్నారు. విజయదశమి సందర్భంగా వనితలపై 'న్యూస్‌టుడే' ప్రత్యేక కథనం. – న్యూస్‌టుడే, కావలి

సేవా కిరణం



రక్తదానం చేస్తున్న అరుణ

పట్టణానికి చెందిన జేడీ ఫౌండేషన్ కన్వీనర్ మాకినేని అరుణ ఆపన్నుల సేవలో తరిస్తున్నారు. పదేళ్లకు పైగా పేదలకు అండగా నిలుస్తున్నారు. పలువురి మహిళలతో కలసి పండగలు, జాతీయ దినోత్సవాలు తదితర సందర్భాల్లో ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ప్రాణాపాయ పరిస్థితుల్లో ఉన్న వారిని ఆదుకోవడానికి రక్తదానం చేస్తున్నారు. ప్లాస్టిక్ వస్తువుల వాడకంతో జరిగే అనర్థాలను వివరిస్తున్నారు. వెటరన్ క్రీడాకారిణిగా గుర్తింపు పొందారు. పోటీల్లో పాల్గొని పతకాలు సాధిస్తున్నారు. పర్యావరణ పరిరక్షణకు మొక్కల పెంపకం చేస్తున్నారు. ఏటా వినాయకచవితికి మట్టి బొమ్మలు అందజేస్తున్నారు. పర్యావరణహితంగా పండగ చేసుకోవాలని ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. రెడ్‌క్రాస్ సేవా కార్యక్రమాల్లోనూ ఉత్సాహంగా పాల్గొంటున్నారు.

నటరాజ తనయ



పట్టణంలోని సంకులవారితోటకు చెందిన కుల్లూరు సాయిచందన సంప్రదాయ నృత్యంలో జాతీయ స్థాయిలో గుర్తింపు పొందారు. ఈమె చిన్ననాటి నుంచి చదువుకుంటూనే నృత్యంలో సాధన కొనసాగించారు. పలు నృత్యరీతుల్లో ప్రావీణ్యం సంపాదించారు. పాలిటెక్నిక్ పూర్తి చేశారు. వేదికలపై ప్రదర్శనలిచ్చి పలువురి అభినందనలు అందుకున్నారు. నటరాజు అవార్డు అందుకున్నారు. గతంలో శ్రీకాళహస్తిలో జరిగిన పోటీల్లో నంది అవార్డును అందుకున్నారు. హైదరాబాద్‌లోని సమతామూర్తి స్ఫూర్తి ఆలయాల వద్ద జరిగిన పోటీల్లోనూ ప్రతిభ చూపారు. వారణాసిలో నటరాజ అవార్డు పొందారు.

శ్రావ్యపథం



రక్తదానంపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న శ్రావ్య

కావలికి చెందిన కంచర్ల శ్రావ్య రెడ్‌క్రాస్ యువ విభాగం తరపున సేవల్లో కీలకంగా వ్యవహరిస్తున్నారు. ఇంజినీరింగ్ చదువుతున్న ఈమె తన బంధుమిత్రులను కూడా భాగస్వాములను చేస్తున్నారు. రక్తదానం ఆవశ్యకతపై అవగాహన కల్పిస్తున్నారు. కరోనా మహమ్మారి ప్రబలిన సమయంలో తన కుటుంబం సైతం రక్తదానం వైపు వచ్చేలా చేశారు. ఐదేళ్లుగా సేవా కార్యక్రమాలు చేస్తున్నారు. ఆకలితో పేదలు కనిపిస్తే ఆహారం అందించడం ధ్యేయంగా సాగుతున్నారు. రహదారుల పక్కన ఎవరైనా క్షుద్బాధతో అలమటిస్తే వారి ఆకలి తీరుస్తున్నారు. తండ్రి శ్రీనివాసులు వ్యవసాయం చేస్తున్నారు. తల్లి శ్రీదేవి గృహిణి.



కావలి: బృందావనంలో శ్రీవారి రథోత్సవం.. సీతారామపురం : నిజరూప అలంకారంలో వాసవీకన్యకాపరమేశ్వరి.. ఉదయగిరి: మహిషాసురమర్దిని అలంకారంలో పార్వతీదేవి.. కందుకూరుపట్టణం: మహిషాసురమర్దినిగా దుర్గాదేవి

జయహో దుర్గాభవాని!



అల్లూరు: గ్రామంలో ఊరేగింపు

న్యూస్‌టుడే బృందం, కావలి, కందుకూరు, ఉదయగిరి: దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. శుక్రవారం దేవాలయాల్లో అమ్మవార్లను వివిధ మహిషాసురమర్దనిగా అలంకరించి పూజలు చేశారు. ఆలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. గ్రామోత్సవాలు కోలాహలంగా జరిగాయి.

మురుగునీటి కాలువ ఏర్పాటు



కలిగిరి, న్యూస్‌టుడే: మండల కేంద్రమైన కలిగిరిలోని కొండాపురం రోడ్డులో చేరిన వర్షపునీటిని బయటకు పంపేందుకు పంచాయతీ పాలకులు జేసీబీల సాయంతో రోడ్డు పక్కన శుక్రవారం కాలువ తీయించారు. ఆ రోడ్డుపై ఏర్పడిన గోతుల్లో నీరు చేరడంతో ప్రయాణికుల రాకపోకలకు ఇబ్బందిగా ఉందని శుక్రవారం 'ఈనాడు'లో ప్రచురితమైన 'కొండాపురం రోడ్డు ఇలా' శీర్షిక కథనానికి కలిగిరి పంచాయతీ పాలకులు స్పందించారు. పంచాయతీ కార్యదర్శి అశోక్ ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. జేసీబీతో రోడ్డు పక్కన కచ్చా కాలువ తీయించారు.

హోంమంత్రికి సమస్యల నివేదన

కావలి, న్యూస్‌టుడే: రాష్ట్ర హోంమంత్రి అనితకు జనసేన పార్టీ కావలి నియోజకవర్గ బాధ్యుడు అళహరి సుధాకర్ నియోజకవర్గంలో సమస్యలు పరిష్కరించాలని కోరారు. శుక్రవారం తాడేపల్లిలో ఆమెను కలిసి డీఎస్పీ అతిథిగృహం, రెండో పట్టణ స్టేషన్ వద్ద ఉన్న పోలీసు క్వార్టర్స్ శిథిలమయ్యాయన్నారు. వాటిని నిర్మించాలని విజ్ఞప్తిచేశారు..



మంత్రి అనితతో జనసేన కావలి బాధ్యుడు అళహరి సుధాకర్

కోడిపందేల స్థావరంపై దాడి

కలిగిరి, న్యూస్‌టుడే: మండలంలోని నాగసముద్రం పరిధిలో ఉన్న అటవీ ప్రాంతంలో నిర్వహిస్తున్న కోడిపందేల స్థావరంపై సీఐ వెంకట నారాయణ ఆదేశాల మేరకు ఎస్సై ఉమాశంకర్ శుక్రవారం సిబ్బందితో వెళ్లి దాడులు చేశారు. పందేలు నిర్వహిస్తున్న ఎనిమిది మందిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. వారి నుంచి రూ.8,300 నగదు, రెండు కోళ్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. జూదం నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

చెరువు కట్ట ధ్వంసంపై కేసు

ఉలవపాడు: కృష్ణాపురంలో చెరువుకట్ట ధ్వంసం చేయడంపై పోలీసులు శుక్రవారం కేసు నమోదుచేశారు. ఎస్సై అంకమ్మ వివరాల మేరకు వెంకటేశ్వర్లు, వీరాస్వామి చెరువుకట్టను ధ్వంసం చేసినట్లు గ్రామస్థులు గుర్తించి జలవనరుల శాఖాధికారి సీతారామయ్యకు తెలియజేశారు. ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు.

● చెట్లు నరికివేతపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై అంకమ్మ తెలిపారు. బద్దిపూడికి చెందిన కందుల శ్రీను స్థలంలోకి అన్న కుమారులైన రాము, నాగరాజు, పద్మ ప్రవేశించి చెట్లు కొట్టి దూషించారు. కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా!

(10 AM to 1 PM) కావలి : 80080 51666, 91548 46698
కందుకూరు:70939 81624, ఉదయగిరి : 80085 73944

సమస్య: ఎస్సీలకు నెలవారీగా 100 యూనిట్ల వరకు విద్యుత్తు ఉచితమని ప్రభుత్వం నిర్దేశించింది. టిడ్కో సముదాయంలో దళిత కుటుంబాలకు ఫీజులు వసూలు చేస్తున్నారు.

- జ్యోతి బాబురావు, అంబేడ్కర్‌నగర్

సమాధానం: ఆ నిబంధనలను అనుసరించి మీటర్లు వినియోగించే వారంతా కులధ్రువీకరణ పత్రాలు అందజేస్తే బిల్లులు రావు.

- చేజర్ల శ్రీనివాసులురెడ్డి, ఏఈ, ఎస్పీడీసీఎల్ - న్యూస్‌టుడే, కావలి

? గ్రామంలోని ప్రధాన రోడ్డులో ఆక్రమణలు ఎక్కువయ్యాయి. రోడ్డులోకి రావడంతో వాహనాల రాకపోకలకు సమస్యగా మారింది.

-చంద్ర, అల్లూరు

✓ ఆక్రమణల తొలగింపునకు చర్యలు తీసుకుంటాం. **- నాగరాజు, ర.భ ఎఈ -అల్లూరు,**

? పాత రైల్వేరోడ్డులోని వీధుల్లో వీధిదీపాలు సక్రమంగా వెలగడంలేదు. **- శ్రీకాంత్, ఉలవపాడు**

✓ రెండు రోజుల్లో వీధిదీపాలు వెలిగించే ఏర్పాటు చేయిస్తాను. **- వీరయ్య, పంచాయతీ కార్యదర్శి - న్యూస్‌టుడే, వలేటివారిపాలెం**

పల్లె.. ప్రతి పైసాకు లెక్క!

న్యూస్‌టుడే, నెల్లూరు(జడ్పీ)



ప్రత్యేక యాప్‌పై శిక్షణలో ఎంపీడీవోలు

పల్లె ప్రగతిలో నూతన ఒరవడికి కసరత్తు మొదలైంది. ఇప్పటి వరకు గ్రామాలు, మండలాలకు సాధారణ, 15వ ఆర్థిక సంఘం నిధులు వస్తున్నా.. వాటి వ్యయ నిర్వహణ బయటకు తెలియడం లేదు. దీంతో ఇలాంటి లోపాలకు స్వస్తి పలికేందుకు రాష్ట్ర పంచాయతీ అధికారుల ఆదేశాలతో జిల్లాలో చర్యలు తీసుకుంటున్నారు. మొత్తం 37 మండలాలు.. వాటి పరిధిలోని 722 గ్రామాల్లో ఏ ఖాతా కింద నిధులు ఉన్నాయి? ఏ గ్రామానికి ఏ పని కావాలి? అందుకు నిధులు ఎంత అవసరం? ఇలా.. ప్రతి పైసాకు లెక్క చెప్పేలా వారం రోజులుగా ప్రత్యేక కార్యక్రమం జరుగుతోంది.

ఎంపీడీవోలకు ఆదేశాలిచ్చాం

ఇది మంచి కార్యక్రమం. యాప్ ద్వారా నివేదికలు తెప్పిస్తున్నాం. రాబోయే నిధులతో ప్రగతిలో నూతన ఒరవడి చూపిస్తాం. ప్రతి పల్లె నుంచి సమగ్ర సమాచారం సేకరిస్తున్నాం.

\- మోహనరావు, ఇన్‌ఛార్జి జడ్పీ సీఈవో

సమాచారం సేకరిస్తున్నాం

ప్రతి గ్రామ పంచాయతీ ఖాతాలో ఎంత మేర నిధులు ఉన్నాయి? రాబోయే నిధులతో ముందస్తు అంచనా ప్రకారం ప్రజలకు కనిపించి, వినియోగించేలా ప్రత్యేక యాప్ ఇచ్చి.. సమాచారం సేకరిస్తున్నాం. ప్రణాళిక ప్రకారం పనులు చేయిస్తాం.

-శ్రీధర్‌రెడ్డి, డీపీవో

ప్రత్యేక యాప్‌తో...

పంచాయతీ, మండల స్థాయిలో వచ్చే నిధులు అందరికీ తెలిసేలా, సద్వినియోగం జరిగేలా ఎంపీడీవోలు, కార్యదర్శులకు.. డీపీవో, జడ్పీ సీఈవోల ఆధ్వర్యంలో ప్రత్యేక యాప్ రూపొందించారు. దీని ద్వారా ప్రస్తుతం ఎంత మేరకు నిధులు ఉన్నాయి? ఎన్ని రాబోతున్నాయనే అంచనాకు వస్తారు. తద్వారా ఏయే అభివృద్ధి పనులు చేయాలనే దానిపై ఓ నిర్ణయానికి వస్తారు. సుమారు 20 అంశాలను యాప్ ద్వారా గుర్తించేందుకు స్వయంగా డీపీవో డివిజన్ల వారీగా కార్యదర్శులకు ముఖాముఖి నిర్వహిస్తున్నారు. మండల స్థాయిలో ఎంపీడీవోలకు సుమారు 13 అంశాలతో కూడిన యాప్ ఇచ్చి.. ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. అందులో ప్రధానంగా గ్రామాల పేరుతో స్వాగత ఆర్చీలు, రచ్చబండలు, గ్రావెల్ రోడ్లకు మరమ్మతులు, వాణిజ్య సముదాయాల నిర్మాణాలు, నీళ్ల ట్యాంకుల మరమ్మతులు, కుళాయిల చుట్టూ ప్లాట్‌ఫారంల ఏర్పాటు, బస్‌షెల్టర్ నిర్మాణం.. ఉండనున్నాయి.

రైళ్ల రాకపోకలు ఆలస్యం

నెల్లూరు(రైల్వే) : తమిళనాడు రాష్ట్రం తిరువళ్లూరులో రైళ్లు ఢీకొన్న ఘటనతో.. రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. చెన్నై-విజయవాడ మీదుగా వెళ్లాల్సిన రైళ్లు ఆలస్యంగా నడుస్తున్నాయి. బొకారో ఎక్స్‌ప్రెస్‌ను నెల్లూరు స్టేషన్‌లో గంటకుపైగా నిలిపివేశారు. రేణిగుంట మీదుగా చెన్నైకు నడిపేలా నిర్ణయించడంతో రాత్రి 11.10 గంటలకు బయలుదేరింది. రైలు ప్రమాదం నేపథ్యంలో విజయవాడ రైల్వే డివిజన్ అధికారులు ప్రయాణికుల సౌకర్యార్థం పలు స్టేషన్లకు హెల్ప్ లైన్ నంబర్లు ప్రకటించారు.

ఎన్‌సీసీ అధికారికి లెఫ్టినెంట్ హోదా

విడవలూరు : విడవలూరులోని పీఆర్ఆర్ అండ్ వీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్‌సీసీ కేర్ టేకింగ్ అధికారి న్యామతుల్లాకు లెఫ్టినెంట్ హోదా లభించిందని ప్రిన్సిపల్ డాక్టర్ సుజాత శుక్రవారం తెలిపారు. మహారాష్ట్రలోని నాగపూర్ ఎన్‌సీసీ ఆఫీసర్స్ ట్రైనింగ్ అకాడమీలో 75 రోజులు శిక్షణ పొందిన తరువాత.. అక్కడ నిర్వహించిన పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించడంతో హోదా దక్కిందన్నారు. అకాడమీ కమాండెంట్ మేజర్ జనరల్ కపిల్‌జిత్ రాథోడ్ సమక్షంలో హోదా పొందారని తెలిపారు.



కాలువల విస్మరణ.. గుంతలతో ఆందోళన

జిల్లాలోని సంగం మండల కేంద్రంలో ప్రధాన రహదారిపై ప్రమాదకరంగా ఉన్న గుంత ఇది. ప్రభుత్వ కార్యాలయాలు, ఆసుపత్రి ఈ మార్గంలోనే ఉన్నాయి. జాతీయ రహదారికి ఈ ప్రాంతం నుంచే వెళ్లాలి. రెండు వైపులా కాలువలు లేక వర్షపు నీరు నిలిచి రోడ్డు దెబ్బతినింది. వాహనాల రాకపోకలకు వాహనచోదకులు అవస్థలు పడుతున్నారు. అధికారులు స్పందించి రోడ్డును బాగు చేయాలని స్థానికులు, వాహనచోదకులు కోరుతున్నారు. –ఈనాడు, నెల్లూరు

గంజాయి తరలిస్తున్న అంతర్రాష్ట్ర స్మగ్లర్ పట్టివేత

కోవూరు, న్యూస్‌టుడే: పట్టణ పరిధిలోని పడుగుపాడు రైల్వేస్టేషన్ వద్ద రేల్వే [illegible] పోలీసులకు సమాచారమిచ్చారు. సంఘటన స్థలానికి చేరుకొని అదుపులోకి తీసు[illegible]



వివరాలు వెల్లడిస్తున్న కోవూరు సీఐ సుధాకర్‌రెడ్డి

182 దుకాణాలకు 3,833 దరఖాస్తులు

నెల్లూరు(నేర విభాగం) : నూతన మద్యం విధానంలో భాగంగా 182 ప్రైవేటు మద్యం దుకాణాలకు ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ ద్వారా 3,833 దరఖాస్తులు [illegible]

మాజీ హోంగార్డు అరెస్టు

నెల్లూరు(నేర విభాగం) : [illegible]

ప్రమాద స్థలానికి రిలీఫ్ రైలు

బిట్రగుంట: [illegible] చెందిన సుశీలమ్మ అనే మహిళ సంగం [illegible] అవసరమైన సిబ్బందితో పాటు రైళ్లకు మరమ్మతులు చేసే సామగ్రితో వెళ్లింది. ఇందులో టీఎక్స్ఆర్, పీడబ్ల్యూఐ, ట్రాఫిక్ తదితర విభాగాల అధికారులు, సిబ్బంది కూడా ఉన్నారు. పడిపోయిన రైళ్లను పునరుద్ధరించడంతో పాటు మరమ్మతులు చేయనున్నారు. రైళ్లన్నీ దారి మళ్లించారు. జనశతాబ్ది ఎక్స్‌ప్రెస్‌ను శనివారం రద్దు చేశారు.

వేధింపులపై కేసు.. అనాథాశ్రమానికి బాలలు

సంగం, న్యూస్‌టుడే: [illegible]



బాలలను అధికారులకు అప్పగించిన ఎస్సై రాజేష్

[illegible] వద్ద బాతులు మేపిస్తూ.. వేతనం ఇవ్వకుండా వేధింపులకు గురిచేస్తుండేది. దీంతో బాలలు తప్పించుకుని సంగం పోలీసుస్టేషన్‌కు చేరారు. విచారణ అనంతరం ఎస్సై పి.రాజేష్ సదురు [illegible] జిల్లా అధి[illegible] సంక్షేమశా[illegible] సునీలత [illegible] బాలలు, [illegible] రులోని [illegible]

మంత్రి లోకేశ్‌కు ఒప్పంద అధ్యాపకుల వినతి



మంత్రి నారాలోకేశ్‌కు వినతి పత్రం ఇస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులు

నెల్లూరు(విద్య), న్యూస్‌టుడే: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న ఒప్పంద అధ్యాపకుల సమస్యలు పరిష్కరించాలని ఒప్పంద అధ్యాపకుల ఐకాస ఆధ్వర్యంలో శుక్రవారం అమరావతిలో నారా లోకేశ్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఐకాస రాష్ట్ర సహ ఛైర్మన్ కల్లూరి శ్రీనివాస్ మాట్లాడుతూ.. రెగ్యులరైజేషన్ ప్రక్రియను కొనసాగించాలని, ఉద్యోగోన్నతుల్లో వృత్తి విద్యా అధ్యాపకులకు నష్టం జరగకుండా చూడాలని కోరారు. ఐకాస ఛైర్మన్ సురేష్, వైస్ ఛైర్మన్ వీరయ్య, ప్రభుదాస్ తదితరులు పాల్గొన్నారు.

కొయ్యతో జగన్మాత ప్రతిమ



మనుబోలు : విజయదశమి సందర్భంగా మనుబోలు పంచాయతీ యాచవరానికి చెందిన సూక్ష్మ కళాకారుడు ఆలూరు రాముఆచారి కొయ్య ముక్కతో అమ్మవారి ప్రతిమను తీర్చిదిద్దారు. సుమారు 9 సెం.మీ. ఎత్తుతో జగన్మాతా ప్రతిమను తీర్చిదిద్ది అబ్బురపరిచారు. ఈసందర్భంగా పలువురు ఆయన్ను అభినందిస్తున్నారు.

సమాచార స్రవంతి

బంగారం ధరలు

గ్రాము ధర:	రూ. 7,303
(3 శాతం జీఎస్టీ కలిసిన ధర)	
సవర ధర:	రూ. 58,424
వెండి గ్రాము :	రూ. 95.00

వెంకాబ్ కోళ్ల ధరలు

బ్రాయిలర్ (రైతుధర)	126
రిటైల్	148
లేయర్	115
బ్రాయిలర్స్	215
బ్రాయిలర్స్ స్కిన్‌లెస్	244
లేయర్ మాంసం	195
నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్	
బ్రాయిలర్	136
లేయర్	118
బ్రాయిలర్స్	244
బ్రాయిలర్స్ స్కిన్‌లెస్	268
లేయర్ మాంసం	200

కోవూరు

• కోవూరు • సర్వేపల్లి • ఆత్మకూరు

తాగునీటి మోటార్లకు మరమ్మతులు


మరమ్మతులు చేయిస్తున్న ఉపసర్పంచి తులసీరామ్

మనుబోలు, న్యూస్‌టుడే: మండలంలోని జట్లకొండూరు పంచాయతీలో త్రీఫేజ్ విద్యుత్తు సమస్య కారణంగా తాగు నీటి పథకం కింద ఏర్పాటుచేసిన మూడు మోటార్లు కాలిపోయి ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడ్డారు. ఉపసర్పంచి తులసీరామ్ స్పందించి యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేయిస్తున్నారు. సర్పంచి కట్టుబూరి నాగమ్మ సహకారంతో ఆదురుదిబ్బవాడలో కొత్త మోటార్లను ఏర్పాటుచేశారు. కొండూరు సత్రంలో రెండు చోట్ల విద్యుత్తు మోటార్లు మరమ్మతులు చేయించి తాగునీరు సరఫరా చేశారు.

పాల ఉత్పత్తిదారులకు బోనస్ నగదు పంపిణీ

మనుబోలు, న్యూస్‌టుడే: స్థానిక విజయ పాల డెయిరీలో శుక్రవారం పాడి రైతులకు సంఘం ఛైర్మన్ పచ్చిపాల శ్రీకాంత్‌రెడ్డి చేతులమీదుగా బోనస్ నగదు అందజేశారు. ఆయన మాట్లాడుతూ దసరా సందర్భంగా పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం ద్వారా ఏటా పాడి రైతులకు బోనస్ నగదు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో పాల డెయిరీ కార్యదర్శి పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, తెదేపా తిరుపతి పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి పచ్చిపాల రామిరెడ్డి, నాయకులు కలికి సుధీర్‌రెడ్డి, మారంరెడ్డి రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా!

(10 AM to 1 PM) కోవూరు : 80085 73987, సర్వేపల్లి : 80085 73980, ఆత్మకూరు: 8008573949

సమస్య: మర్రిపాడు మండలం కేతిగుంట పంచాయతీ పల్లిపాడులో డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో ఇళ్ల నుంచి వచ్చే నీరు రోడ్లపై ప్రవహిస్తోంది. రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నాం. – వెంకటేశ్, కామాక్షిపల్లి

సమాధానం: కాలువ నిర్మాణానికి ప్రతిపాదనలు పంపి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. – కృష్ణవేణి, పంచాయతీ కార్యదర్శి

? మండలంలోని పొంగూరు కండ్రికలో వీధి దీపాలు నిరంతరాయంగా వెలుగుతున్నాయి. పంచాయతీపై విద్యుత్తు బిల్లుల భారం పెరగడంతో పాటు, దీపాలు పాడవుతున్నాయి. – మస్తాన్, స్థానికుడు

✓ విద్యుత్తు శాఖ అధికారులతో మాట్లాడి వీటికి స్విచ్‌లు ఏర్పాటు చేస్తాం. పాడైన దీపాల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయిస్తాం. – భరత్, పంచాయతీ కార్యదర్శి

? విడవలూరులోని ఇందిరమ్మ కాలనీ, రామతీర్థం రోడ్‌లో దోమల బెడద అధికంగా ఉంది. కంటి మీద కునుకు ఉండటం లేదు. దోమల నివారణకు చర్యలు చేపట్టాలి. – స్థానికులు

✓ పరిశీలించి దోమలు ప్రబలకుండా త్వరలో చర్యలు చేపడతాం. – నగేశ్‌కుమారి, ఎంపీడీవో

నాసిరకం పనులు.. పట్టించుకోని అధికారులు

రూ.రెండు కోట్ల పనుల్లో ఇష్టారాజ్యం

న్యూస్‌టుడే, సైదాపురం, ముత్తుకూరు

గత వైకాపా పాలనలో గ్రామీణ ప్రాంతాల్లో కనీస వసతులతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.. సర్వేపల్లి నియోజకవర్గంలోని పలు చోట్ల రోడ్లు గుంతలు పడి అధ్వానంగా ఉన్నా పట్టించుకోలేదు.. సైదాపురం మండలంలో భారీగా తెల్లరాయి, ఖనిజాలు తరలించడంతో రోడ్లు అడుగుకో గుంత ఏర్పడింది. ఎన్నికల సమయంలో సైదాపురంలోని ప్రధాన రోడ్లకు కలెక్టర్ ప్రత్యేక చొరవ చూపి నిధులు మంజూరు చేశారు. చేస్తున్న పనుల్లో నాణ్యత నేతిబీరగా మారింది. అధికారుల పర్యవేక్షణ నామమాత్రం కావడంతో రోడ్డు పనులు నాసిరకంగా జరుగుతున్నాయని స్థానికులు వాపోతున్నారు.

సైదాపురం మండల పరిధిలో..

గూడూరు- రాజంపేట మార్గంలోని సైదాపురం సమీపంలో రోడ్డు గుంతలు బాగు చేసేందుకు మినరల్ ఫండ్ కింద కలెక్టరు రూ.రెండు కోట్ల రూపాయలు మంజూరు చేశారు. ప్రధాన మార్గంలో 12వ కిలోమీటరు నుంచి 22వ కిలోమీటరు వరకు రోడ్డుపై గుంతలు ఎక్కడ కనిపించినా నాణ్యతగా పనులు చేయాలి. ప్రస్తుతం సైదాపురం సమీపంలోని క్రైస్తవ నది ప్రాంతం నుంచి రాపూరు క్రాస్ రోడ్డు వరకు పనులు జరుగుతున్నాయి. అధికారుల పర్యవేక్షణ లేక ఇష్టానికి పాత రోడ్డును పూర్తిగా తొలగించకుండానే పాటు కంకరపొడి మిశ్రమాన్ని రెండు లేయర్లుగా వేశారు. దీంతో క్యూరింగ్ చేసి రోలింగ్ చేయాలి. పనులు నామమాత్రంగా చేపట్టి తారు వేయడంతో రోడ్డు నాణ్యత ప్రశ్నార్థకంగా మారిందని పరిశీలనకు వచ్చిన ఈఈకి స్థానికులు విన్నవించారు. పరిశీలనకు వచ్చిన ఈఈ పత్తాలేకుండా పోయారు. రెండు కిలోమీటర్ల రోడ్డు ప్రస్తుతం రెండుకోట్ల రూపాయలతో నిధులు అందించినప్పటికీ పనులు సక్రమంగా చేయడం లేదని పలువురు వాపోతున్నారు. పర్యవేక్షించాల్సిన స్థానిక అధికారులు సెలవులో వెళ్లడం, వేరే ప్రాంతం అధికారుల పర్యవేక్షణ చేయడంతో సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. జిల్లా ఉన్నతాధికారులు దృష్టిసారించి రోడ్డుపనులు నాణ్యతగా జరిగేలా చూడాలని స్థానికులు కోరుతున్నారు.


సైదాపురం సమీపంలో జరుగుతున్న రోడ్డుపనులు

● ఆర్‌అండ్‌బీ ఈఈ మురళీకృష్ణ మాట్లాడుతూ సైదాపురం సమీపంలో రోడ్డు పనులు అధికారుల పర్యవేక్షణలోనే జరుగుతున్నాయన్నారు. పనులు నాణ్యతగా చేస్తున్నారని పేర్కొన్నారు.

తాగునీటి పైపులకు కొళాయిల బిగింపు

స్పందనకు వందనం

కోవూరు, న్యూస్‌టుడే: పట్టణ పరిధిలోని గుమ్మళ్ల దిబ్బ నూతన కాలనీలో తాగునీటి పైపులకు పంచాయతీ ఈవో శివకుమార్ శుక్రవారం కుళాయిలు ఏర్పాటు చేశారు. కాలనీలో పైపులకు కుళాయిలు లేక నీరు రోడ్డు మీదకు చేరుతుండటంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ఈనెల 5న 'ఈనాడు'లో 'నీటి వృథా' శీర్షికతో కథనం ప్రచురితమైంది. కాలనీలో పలుచోట్ల నీటి పైపులకు కొళాయిలు ఏర్పాటు చేశారు. సమస్య పరిష్కారమవడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.


జొన్నవాడలో..


సంగంలో..


మనుబోలులో..


పొదలకూరులో..


ఆత్మకూరులో..


చేజర్లలో..

మహిషాసురమర్దిని పాహిమాం

బుచ్చిరెడ్డిపాళెం, ముత్తుకూరు, తోటపల్లిగూడూరు, విడవలూరు, కోవూరు, మనుబోలు, రాపూరు, సైదాపురం, పొదలకూరు, కలువాయి, ఆత్మకూరు, అనంతసాగరం, సంగం, చేజర్ల, ఏఎస్‌పేట, న్యూస్‌టుడే: దసరా శరన్నవరాత్రి మహోత్సవాల సందర్భంగా కోవూరు, సర్వేపల్లి, ఆత్మకూరు నియోజకవర్గాలతో పాటు రాపూరు, కలువాయి, సైదాపురం మండలాల్లో వైభవంగా జరుగుతున్నాయి. జొన్నవాడ మల్లికార్జునస్వామి కామాక్షితాయి అమ్మవారు మహిషాసురమర్దినిగా భక్తులకు శుక్రవారం దర్శనమిచ్చారు. పెంచలకోనలో ఆదిలక్ష్మి అమ్మవారు ధనలక్ష్మి అలంకారంలో అభయమిచ్చారు. ముత్తుకూరు, తోటపల్లిగూడూరులోని ఆలయాల్లో భక్తులు అమ్మవార్లను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. విడవలూరులోని పీర్లచావిడి వద్ద ప్రత్యేక పూజలు జరిగాయి. కోవూరు నాగావరపమ్మ అమ్మవారు కాళికాదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. మనుబోలులో లలితాత్రిపుర సుందరి అలంకరణలో, సైదాపురంలో కాళికాదేవి అలంకారంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు శ్రీకలువాయమ్మ మహషాసుర మర్దిని అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆత్మకూరులోని కాశీనాయన ఆశ్రమంలోని దుర్గామల్లేశ్వరస్వామి ఆలయంలో కనకదుర్గాదేగాపూజలందుకున్నారు. సోమశిలలోని సోమేశ్వరాలయంలో కామాక్షి అమ్మవారు, ఏఎస్‌పేటలో కన్యకాపరమేశ్వరి మహిషాసురమర్దిని అలంకారంలో దర్శనమిచ్చారు. చేజర్లలోని ఆలయాల్లో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సంగంలో మహిషాసురమర్దినిగా కామాక్షిదేవి దర్శనమిచ్చారు.


విడవలూరు పీర్లచావిడి వద్ద పూజలో భక్తులు

అక్రమాలకు తావులేకుండా అభివృద్ధి పనులు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి

వెంకటాచలం, న్యూస్‌టుడే: అయిదేళ్ల వైకాపా పాలనలో నాయకులు దోపిడీకి పాల్పడ్డారని ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి మండిపడ్డారు. తెదేపా పాలనలో అక్రమాలకు తావులేకుండా పనులు చేపట్టనున్నట్లు స్పష్టం చేశారు. ఇస్కపాళెంలో జరుగుతున్న మాతమ్మ జాతరలో శుక్రవారం సాయంత్రం పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మాట్లాడుతూ... త్వరలో కాలువల పూడికతీత పనులు చేపట్టి, కనుపూరు కాలువతో పాటు ఇతర పనులు పూర్తి చేయనున్నట్లు తెలిపారు.

ఆశ్రమంలో అన్నదానం

రాపూరు, న్యూస్‌టుడే: మండలంలోని పెంచలకోన మాతృదేవి విశ్వశాంతి ఆశ్రమ వ్యవస్థాపకురాలు విజయేశ్వరిదేవి నేతృత్వంలో శుక్రవారం దసరా శరన్నవరాత్రుల వేడుకలు వైభవంగా నిర్వహించారు. ప్రత్యేక పూజలు హోమాలు నిర్వహించారు. అక్కడికొచ్చిన భక్తులకు ఆధ్యాత్మిక చింతనపై దైవ సందేశమిచ్చారు. వేడుకల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. వివిధ ప్రాంతాల నుంచి పాల్గొన్న భక్తులకు అన్నదానం నిర్వహించారు.

పగలే వెన్నెల



మనుబోలు మండలంలోని పలు గ్రామాల్లో వీధిదీపాల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. వీరంపల్లిలో ప్రధాన రహదారిపై రాత్రి పగలూ తేడా లేకుండా వీధి దీపాలు వెలుగుతున్నాయి. విద్యుత్తు ఆదా చేయాల్సి ఉండగా అధికారుల నిర్లక్ష్య ధోరణితో ఇబ్బందులు తప్పడం లేదు. సంబంధిత అధికారులు స్పందించి పగలు వీధిదీపాలు వెలగకుండా చూడాలని గ్రామస్థులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, మనుబోలు

బురదమయం



వర్షం కురిసి రెండు రోజులైనా నీరు రోడ్డుపై నిలిచి ఉండటంతో వాహనదారులు, పాదచారులు అవస్థలు పడుతున్నారు. విడవలూరు మండలంలోని ఊటుకూరు పెద్దపాలెంలో వర్షపు నీరు రోడ్డుపై నిలిచిపోవడంతో శుక్రవారం ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కొద్దిపాటి వర్షం కురిసినా నీరు రోడ్లపై నిలుస్తోందని గ్రామస్థులు వాపోతున్నారు. ఎంపీడీవో నగేశ్‌కుమారి మాట్లాడుతూ పంచాయతీ సిబ్బందితో మాట్లాడి సమస్య పరిష్కరిస్తామన్నారు.
– న్యూస్‌టుడే, విడవలూరు, ఇందుకూరుపేట

రోడ్డుపై రంధ్రం.. తప్పని అవస్థ



ఏఎస్‌పేట నుంచి పొనుగోడు గ్రామానికి వెళ్లే రోడ్డుపై ఉన్న వంతెనకు రంధ్రం పడటంతో గ్రామస్థులు అవస్థలు ఎదుర్కొంటున్నారు. గురువారం కురిసిన వర్షంతో మరింత పెద్దదయింది. దాంతో గ్రామస్థుల రాకపోకలకు సమస్య మొదలైంది. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లనున్నట్లు పొనుగోడు సర్పంచి గంగవరపు పద్మయ్యనాయుడు తెలిపారు.
– న్యూస్‌టుడే, అనుమసముద్రంపేట

విస్తృతంగా పూడికతీత పనులు



మండల పరిధిలోని ఊటుకూరులో ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి సొంత నిధులతో తుంగ చెరువు కాలువ పూడికతీత పనులు చేపట్టారు. తెదేపా నాయకులు విజయభానురెడ్డి, వంశీకృష్ణారెడ్డి మాట్లాడుతూ గత వైకాపా పాలనలో పూడిక పనులు చేయక రైతులు ఇబ్బందులు పడ్డారన్నారు. వారి అవస్థలు ఎమ్మెల్యేకు వివరించడంతో నిధులు వెచ్చించి జేసీబీ యంత్రం కేటాయించి పూడికతీత పనులు చేపట్టినందుకు ధన్యవాదాలు తెలిపారు. - న్యూస్‌టుడే, విడవలూరు

తాళం వేసిన ఇంట్లో చోరీ

రూ.3 లక్షల నగదు.. 15 సవర్ల బంగారం అపహరణ

కలువాయి, న్యూస్‌టుడే: తాళం వేసిన ఇంట్లో దుండగులు ప్రవేశించి నగదు, బంగారం దోచుకెళ్లిన సంఘటన కలువాయిలో జరిగింది. పోలీసుల వివరాల మేరకు... కలువాయికి చెందిన ఉపాధ్యాయుడు సురేష్ దంపతులు దసరా సెలవుల నేపథ్యంలో 7వ తేదీ నెల్లూరు వెళ్లారు. బంధువుల వివాహం నేపథ్యంలో శుక్రవారం సాయంత్రం సురేష్ కలువాయికి వచ్చారు. ప్రధాన తలుపులు ధ్వంసం చేసి ఉండటంతో భయభ్రాంతులకు గురయ్యారు. లోపలికి వెళ్లి పరిశీలించి వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్సై సుమన్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. క్లూస్ టీం వేలిముద్రలు సేకరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

సంక్షిప్త సమాచారం

మహిళపై వీధి కుక్కల దాడి

అనంతసాగరం: మండల పరిధిలోని లింగంగుంట గ్రామంలో వీధి కుక్కలు శుక్రవారం స్వైరవిహారం చేశాయి. గ్రామానికి చెందిన రెడ్డిమళ్ల లక్ష్మమ్మపై దాడి చేసి చేతి భాగాన్ని తీవ్రంగా గాయపరిచాయి. ఆమెను ప్రథమ చికిత్స నిమిత్తం వైద్యశాలకు తరలించారు.

తపాలా సేవలు సద్వినియోగం చేసుకోండి

తోటపల్లిగూడూరు, మనుబోలు: తపాలా శాఖ అమలు చేస్తున్న పథకాలు, అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని నెల్లూరు ఈస్ట్ సబ్‌డివిజన్ పోస్టల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు పేర్కొన్నారు. సౌత్ ఆములూరులో శుక్రవారం పోస్టల్ సిబ్బంది ఆధ్వర్యంలో 'జనంలోకి మనం' కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు.

రతన్‌టాటా సేవలు ఆదర్శం

ఆత్మకూరు: రతన్‌టాటా సేవలు ఆదర్శమని వక్తలు పేర్కొన్నారు. జనవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో శుక్రవారం టాటా సంస్మరణ సభ నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంఘం సభ్యులు పాల్గొన్నారు.

కాగులపాడులో వివాదం

బుచ్చిరెడ్డిపాళెం: కాగులపాడు దళితకాలనీలో శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని పూజలు చేసేందుకు మండపం వేయగా, మరో వర్గీయులు అభ్యంతరం తెలపడంతో శుక్రవారం రాత్రి ఘర్షణ వాతావరణం చోటుచేసుకుంది. పోలీసులకు సమాచారమివ్వగా ఇరువర్గాలతో మాట్లాడి సర్దిచెప్పారు.

తెల్లరాయి తరలిస్తున్న టిప్పర్ సీజ్

సైదాపురం: సైదాపురం ప్రాంతం నుంచి అక్రమంగా తెల్లరాయి తరలిస్తున్న టిప్పర్‌ను శుక్రవారం సీజ్‌చేసినట్లు స్థానిక ఎస్సై క్రాంతి కుమార్ తెలిపారు. సైదాపురం నుంచి టిప్పర్ ద్వారా తెల్లరాయి తరలిస్తున్నారనే సమాచారం మేరకు తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

కృష్ణపట్నం పోర్టులో ఆయుధ పూజ

ముత్తుకూరు : మండలంలోని అదాని కృష్ణపట్నం పోర్టులో దుర్గాష్టమి సందర్భంగా శుక్రవారం అడ్మిన్ హెడ్ గణేశ్‌శర్మ ఆధ్వర్యంలో ఆయుధ పూజ నిర్వహించారు. పోర్టు పరిపాలన భవన ప్రాంగణంలో వాహనాలకు పూజలు చేశారు.

ఉపాధి పనుల్లో అక్రమాలు తేల్చండి

మనుబోలు, న్యూస్‌టుడే: ఉపాధి పనుల్లో జరిగిన అవినీతి, అక్రమాలను నిగ్గుతేల్చాలని తెదేపా నాయకుడు కసిరెడ్డి సునీల్‌రెడ్డి డిమాండ్ చేశారు. కొలనుకుదురులో 2023-24కు సంబంధించి ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీల్లో భాగంగా సర్పంచి వెంకటరమణయ్య అధ్యక్షతన శుక్రవారం గ్రామసభ నిర్వహించారు. డీఆర్పీ చినరాయుడు గ్రామంలో ఉపాధిహామీ కింద ఏ పనులు చేశారో చదివి వినిపించారు. సుమారు రూ.28 లక్షలతో 53 పనులు చేశారన్నారు. మస్టర్‌లో సంతకాలు లేకుండా నగదు చెల్లించినట్లు గుర్తించామన్నారు. చెరువుల్లో పశువుల గుంత పనుల్లో కొలతలు తక్కువగా వచ్చాయని, గ్రామాల్లో అభివృద్ధి పనులకు సంబంధించి శిలాఫలకాలు వేయలేదన్నారు. ఇంటికి స్లాబ్ లేకుండానే బిల్లులు చెల్లించారని ప్రశ్నించారు. మే నెలకు సంబంధించి నగదు రాలేదని కూలీలు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. సునీల్‌రెడ్డి మాట్లాడుతూ 224 జాబ్‌కార్డులుంటే కొందరికి మాత్రమే పనులు కల్పించారని, గ్రామంలో లేనివారికి పనులు కల్పించి అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. ఇంటి నిర్మాణంలో భాగంగా 62 పనిదినాలు కల్పించాల్సి ఉంటే ఏకంగా 90 ఎలా చేయించారని ప్రశ్నించారు. పనుల్లో జరిగిన అవకతవకలపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటామని చినరాయుడు తెలిపారు. కార్యక్రమంలో టీఏ గురప్ప, ఎఫ్ఏ యజ్దాని తదితరులు పాల్గొన్నారు.


గ్రామసభలో మాట్లాడుతున్న డీఆర్పీ చినరాయుడు

పంట కాలువల్లో మద్యం సీసాలు.. నీటి పారుదలకు ఆటంకాలు

కోవూరు, న్యూస్‌టుడే: సాధారణంగా పంట కాలువల్లో సాగునీరు ప్రవహించాలి. .కానీ కోవూరు మండలంలోని పలు గ్రామాల్లోని పంట కాలువల్లో మాత్రం మద్యం సీసాలు కనిపిస్తున్నాయి. మద్యం బాబులు సీసాలు, ప్లాస్టిక్ గ్లాసులు తీసుకెళ్లి రాత్రి సమయాల్లో పంట కాలువల గట్లపై మద్యం తాగుతున్నారు. ఖాళీ సీసాలను ధ్వంసం చేసి కాలువల్లో పడేస్తున్నారు. ఉపాధి కూలీలు, రైతులు తమ పంట కాలువలను పూడికతీత పనులు చేసేందుకు వచ్చి వారు అవస్థలు పడుతున్నారు. కాళ్లలో సీసాలు గుచ్చుకోవడంతో తీవ్ర గాయాలపాలవుతున్నారు. కాలువల్లో పూడిక తీసేందుకు ఉపాధి కూలీలు భయపడుతున్నారు. స్థానికులు ఇక్కడ మద్యం తాగొద్దని చెబితే ఎక్కడ దాడి చేస్తారోనని మిన్నకుండిపోతున్నారు. వీరి ఆగడాలను ప్రశ్నిస్తే పొలాల్లో పశువుల కోసం ఏర్పాటు చేసుకున్న గడ్డికి నిప్పంటిస్తున్నారని రైతులు వాపోతున్నారు. పోలీసులు నిఘా పెట్టి పంట కాలువల మద్యం తాగకుండా, సామగ్రి కాలువల్లో వేయకుండా అరికట్టాలని రైతులు కోరుతున్నారు.


కొత్తూరు రోడ్డులోని పంటకాలువ దుస్థితి

నెల్లూరు
• నెల్లూరు • నెల్లూరు గ్రామీణం



శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి

విద్యుత్తు శాఖ అతిథి గృహం ప్రారంభం

నెల్లూరు(విద్య), న్యూస్‌టుడే: నగరంలోని విద్యుత్తు భవన్ ఆవరణలో నూతనంగా నిర్మించిన అతిథి గృహాన్ని శుక్రవారం గ్రామీణ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ కార్యాలయంలో ఉన్న పాత అతిథి గృహం శిథిలమైందని, దక్షిణ ప్రాంత విద్యుత్తు పంపిణీ సంస్థ ఛైర్మన్ ఆదేశాల మేరకు కొత్తది నిర్మించినట్లు తెలిపారు. రూ.3 కోట్లతో నూతన పద్ధతిలో నిర్మించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో జిల్లా విద్యుత్తు శాఖ ఎస్ఈ వి.విజయన్, డీఈలు శ్రీధర్, రమేష్, గుత్తేదారుడు వినోద్ తదితరులు పాల్గొన్నారు.

ఏపీకి మంచిరోజులు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట), న్యూస్‌టుడే: మహిషాసురుడి కంటే మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రమాదకరమని.. ఆయన్ని ఓడించిన తరువాతే ఏపీకి మంచి రోజులు వచ్చాయని తెదేపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి పేర్కొన్నారు. నగరంలోని జిల్లా తెదేపా కార్యాలయంలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రజలు 11సీట్లకు పరిమితం చేసినా జగన్‌లో మార్పు రాలేదన్నారు. నెల్లూరును స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దేందుకు మంత్రి నారాయణ కృషి చేస్తున్నారని తెలిపారు. సమావేశంలో నాయకులు మధు, భువనేశ్వరి ప్రసాద్, పిట్టి సత్యనారాయణ, కప్పిర శ్రీనివాసులు, ప్రశాంత్, జాకీర్ తదితరులు పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదుకు స్పందన

నెల్లూరు (బృందావనం): భాజపా సభ్యత్వ నమోదుకు ప్రజల నుంచి స్పందన వస్తోందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి రాజేశ్వరి అన్నారు.

వాహనాల తనిఖీ

కావలి: గౌరవరం సమీపంలో ఉన్న టోల్‌ప్లాజా వద్ద రవాణా శాఖ అధికారులు శుక్రవారం వాహనాలను తనిఖీ చేశారు. నిత్యావసరాల అక్రమ రవాణాను నిరోధించేందుకు తనిఖీ చేసినట్లు రవాణా శాఖ ఫ్లయింగ్ స్క్వాడ్‌లోని అధికారి గోపీనాయక్, ఎంవీఐ సుందరరావుతెలిపారు.

అయిదేళ్లూ నిర్లక్ష్యమే

నీటి పథకానికి నిధులు మంజూరు చేయని వైకాపా ప్రభుత్వం

న్యూస్‌టుడే, నెల్లూరు(నగరపాలకసంస్థ)

పాతకాలం నాటి తాగునీటి వ్యవస్థతో తరచూ నెల్లూరు నగరవాసులు తాగునీటి సమస్యలు ఎదుర్కొంటున్నారు. ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని స్వచ్ఛమైన తాగునీటిని అందించేందుకు 2015లో అప్పటి తెదేపా ప్రభుత్వం రూ.512.76 కోట్లతో తాగునీటి పథకానికి శ్రీకారం చుట్టింది. 724 కిలోమీటర్ల పైపులైన్లు పూర్తి చేశారు. 32 తాగునీటి ట్యాంకులను నిర్మించారు. నగరంలో 70వేల కుళాయి కనెక్షన్లు ఇచ్చేందుకు పైపులను సిద్ధం చేశారు. తెదేపా ప్రభుత్వంలో ప్రారంభించిన పథకం కావడంతో గత అయిదేళ్లుగా వైకాపా ప్రభుత్వం నిర్లక్ష్యం ప్రదర్శించింది.

122 ఎంఎల్‌డీ తాగునీటి పథకం

నెల్లూరునగరం విస్తరించి 54 డివిజన్లు, 150 చదరపు కిలోమీటర్లకు చేరుకుంది. నగరవ్యాప్తంగా 1.56 లక్షల గృహాలు ఉండగా.. దాదాపు 9 లక్షల మంది జనాభా నివసిస్తున్నారు. నగరవాసుల కోసం సంగం మండలం మహ్మదాపురం వద్ద 122 ఎంఎల్‌డీ తాగునీటి పథకాన్ని నిర్మించారు. పెన్నా నదిలో నుంచి తాగునీటిని పంపింగ్ చేసి శుద్ధి చేసిన తర్వాత పైపులైన్ల ద్వారా నెల్లూరు నగరానికి తరలిస్తున్నారు. నగరానికి ప్రతి రోజూ 82 ఎంఎల్‌డీ తాగునీరు అవసరం కాగా.. మధ్యలో మహ్మదాపురం, ములుమూడి తదితర గ్రామాలకు ఆ నీటిని అందిస్తున్నారు. అయిదేళ్లలో గత వైకాపా మంత్రులు, ఎమ్మెల్యేలు పథకం గురించి పట్టించుకున్న దాఖలాలు లేవు. కనీసం మరమ్మతులకు నిధులు మంజూరు చేయలేదు. అధికారులు చిన్నపాటి మరమ్మతులకు కూడా నిధులు లేక మిన్నకుండిపోయారు. ఇళ్లకు తాగునీటి పైపులైన్లను అనుసంధానం చేయకుండా.. పాత పైపులైన్లలోనే నీటిని అందించారు.



ఏసీ నగర్‌లో ట్యాంకర్ నీటిని పట్టుకుంటున్న నగర వాసులు

మూడురోజులుగా పట్టించుకోక..

మహ్మదాపురం తాగునీటి పథకం కోసం ఏర్పాటు చేసిన భారీ ట్రాన్స్‌ఫార్మర్లు పేలిపోయాయి. బుధవారం నాటి ఈదురు గాలులతో పాటు భారీ వర్షానికి ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతిన్నాయి. మూడు రోజులుగా గుత్తేదారుసంస్థ, అధికారులు పట్టించుకోలేదు. తాగునీటి పథకాన్ని పర్యవేక్షిస్తున్న ప్రజా ఆరోగ్యశాఖ, తాగునీటిని సరఫరా చేస్తున్న నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ విభాగం ఎవరికివారు పట్టనట్లుగా వ్యవహరించారు. దీంతో మూడు రోజులు నగర ప్రజలకు తాగునీటి కష్టాలు తప్పలేదు.

నవ్వుతూ సాగుదాం



ర్యాలీలో వివిధ సంస్థల ప్రతినిధులు

నెల్లూరు(జడ్పీ): తీవ్రమైన ఆలోచనలు వద్దు.. ప్రశాంతతే ముద్దు.. అంటూ మానసిక నిపుణులు బ్యానర్లు, ప్లకార్డులు చేతపట్టి నగరంలో ర్యాలీ నిర్వహించారు ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవంలో భాగంగా రెండోరోజు శుక్రవారం సమావేశం నిర్వహించారు. ముందుగా ఈ ప్రోగ్రెసివ్ సైకాలజిస్ట్ ఇండియా అసోసియేషన్, ప్రణవ యోగా విద్యా సంస్థ, యోగా మిత్రమండలి, గీతా వైభవ్ ట్రస్టు, మైయిండ్ మాటర్స్ కౌన్సెలింగ్ సెంటర్, నెల్లూరు లయన్స్ క్లబ్ ఆఫ్ నెల్లూరు తదితర సంస్థల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. గాంధీబొమ్మ సెంటర్‌లో ర్యాలీని యోగా ఆచార్యులు వి.చంద్రశేఖర్ ప్రారంభించారు. అనంతరం గాంధీ పార్కులో సమావేశం నిర్వహించారు. ప్రధాన నిర్వాహకులు వి.చంద్రశేఖర్‌తో పాటు వైభవ్ ట్రస్టు ఛైర్మన్ నజీర్ బాషా, ఇతర ప్రతినిధులు మాట్లాడుతూ బతికినంత కాలం ధర్మంగా ఉంటాం.. నవ్వుతూ సాగిపోతాం.. మనసు శాంతి ఎక్కడ చిక్కితే.. అక్కడే మంచి అలవాట్లతో జీవనం సాగించాలనే సూక్తితో సాగాలని పిలుపు నిచ్చారు. వివిధ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

దేవి దర్శనం.. భక్తుల పరవశం

మహర్నవమిని పురస్కరించుకుని శుక్రవారం భక్తులు ఆలయాలకు తరలివచ్చారు. దేవి ఆలయాల్లో అమ్మవారు విశేష అలంకరణల్లో కొలువుదీరి దర్శనమిచ్చారు. - న్యూస్‌టుడే, నెల్లూరు(సాంస్కృతికం, జడ్పీ)



ఇరుకళల పరమేశ్వరి ఆలయంలో మహిషాసురమర్ధినిగా



మహిషాసురమర్ధినిగా భువనేశ్వరి



గజలక్ష్మిగా కన్యకాపరమేశ్వరి



వేదాయపాలెంలో ధనలక్ష్మి అలంకరణ



కుంకుమ అలంకరణలో మహాకాళీమాత



కొత్తూరు వెంకయ్యస్వామి ఆశ్రమంలో అమ్మవారు



నరసింహకొండలో ధనలక్ష్మిగా



బాలాజీనగర్‌లో మహాకాళిగా



సుజాతమ్మ కాలనీలో మహిషాసురమర్ధినిగా



విరాట్‌నగర్‌లో మహిషాసురమర్ధినిగా

మార్కెట్ యార్డు పరిశీలన

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), న్యూస్‌టుడే: నగరంలోని నవాబుపేట డంపింగ్, మార్కెట్ యార్డులను మంత్రి పొంగూరు నారాయణ శుక్రవారం పరిశీలించారు. డంపింగ్ యార్డ్ నిర్వహణపై అక్కడి సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎప్పటికప్పుడు చెత్తను శుభ్రపరిచేలా చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో నారాయణ విద్యాసంస్థల జీఎం వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు. ● నగరంలోని 9వ డివిజన్‌లో నివాసం ఉంటూ అనారోగ్యంతో ఉన్న స్నేహితుడు సుబ్బారెడ్డిని మంత్రి పరామర్శించారు.

కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్స విజయవంతం

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): హెపటైటిస్ సి పాజిటివ్ ఉన్న వ్యక్తికి క్లిష్టమైన పరిస్థితుల్లో కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్స నిర్వహించినట్లు నెల్లూరు కిమ్స్ ఆసుపత్రి వైద్యులు తెలిపారు. శుక్రవారం నెఫ్రాలజిస్ట్ డాక్టర్ ఎ.సన్నీష్‌రెడ్డి మాట్లాడుతూ.. సైదాపురం మండలానికి చెందిన 32ఏళ్ల యువకుడు నాలుగు సంవత్సరాలుగా కిడ్నీ వ్యాధితో బాధపడుతూ డయాలసిస్ చేయించుకుంటున్నాడు. హెపటైటిస్ సితో బాధపడుతున్నారని తెలిపారు. పరిస్థితి విషమించడంతో కిడ్నీ మార్పిడి చేయాల్సి వచ్చిందని తండ్రే కిడ్నీ దానం చేసేందుకు ముందుకు వచ్చారన్నారు. పూర్తిగా కోలుకున్నట్లు తెలిపారు.

సహాయ కొరియోగ్రాఫర్ వేధిస్తోందని ఫిర్యాదు

నెల్లూరు(నేర విభాగం): కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్ వేధింపుల కేసులో బాధితురాలు, సహాయ కొరియోగ్రాఫర్ తనను లైంగికంగా వేధిస్తోందని రంగనాయకులపేటకు చెందిన సమీర్ అనే యువకుడు శుక్రవారం సంతపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా, ఈయన జానీ మాస్టర్ మేనమామ కుమారుడు కావడం గమనార్హం. ఈ విషయమై సంతపేట ఇన్‌స్పెక్టర్ మద్ది శ్రీనివాసరావును సంప్రదించగా.. ఆ వ్యవహారం మొత్తం తెలంగాణ, చెన్నై రాష్ట్రాల్లో జరగడంతో.. ఉన్నతాధికారుల సూచనల మేరకు న్యాయ నిపుణుల సలహాలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

రొమ్ము క్యాన్సర్ కేసులు పెరుగుదల

నెల్లూరు(స్టోన్‌హౌస్ పేట), న్యూస్‌టుడే: పట్టణ, గ్రామీణ భారతదేశంలో రొమ్ము క్యాన్సర్ కేసులు పెరుగుతున్నాయని మెడికవర్ రేడియేషన్ అంకాలజిస్ట్ డాక్టర్ పీజీఎస్ఆర్ ప్రియ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. జీవనశైలి, ఆహారపు అలవాట్లు తదితర కారణాలు క్యాన్సర్ పెరిగేందుకు దోహదపడుతున్నాయన్నారు. రొమ్ములో నొప్పిలేని గడ్డ, చర్మం మసకబారడం, చనుములపై దద్దుర్లు, పుండు తదితర రొమ్ము క్యాన్సర్ లక్షణాలన్నారు. రొమ్ము క్యాన్సర్ ప్రమాదాన్ని తగ్గించేందుకు క్రమం తప్పకుండా పరీక్షలు, శారీరకంగా చురుగ్గా ఉండడం, వ్యాయామం చేయాలన్నారు.

ప్రజలకు అమ్మవారి ఆశీస్సులు ఉండాలి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), న్యూస్‌టుడే: చెడుపై మంచి సాధించిన విజయానికి చిహ్నమే విజయదశమి అని. . ఈ పర్వదినం సందర్భంగా ప్రతి ఇంట్లో సుఖశాంతులు వెల్లివిరియాలని నెల్లూరు ఎంపీవేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి దంపతులు ప్రకటనలో తెలిపారు. ● రాష్ట్ర ప్రజలకు మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, వక్ఫ్‌బోర్డు ఛైర్మన్ అబ్దుల్ అజీజ్ విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. ● దుర్గామాత ఆశీస్సులతో అందరూ బాగుండాలివిజయదశమి అంటే విజయానికి ప్రతీక అని.. ప్రతి ఒక్కరూ కష్టసుఖాలను అధిగమించి దుర్గామాత ఆశీస్సులతో ముందుకు సాగాలని మంత్రి నారాయణ ఆకాంక్షించారు. రాష్ట్ర ప్రజలందరికీ దసరా శుభాకాంక్షలు తెలిపారు. ● **నెల్లూరు,(జడ్పీ):** జిల్లా ప్రజలు కనకదుర్గమ్మ దయతో సుఖ సంతోషాలతో విజయం వైపు సాగిపోవాలంటూ జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా! (10 AM to 1 PM) నెల్లూరు, గ్రామీణం 80085 50332 80085 74001

సమస్య: కల్లూరుపల్లి హౌసింగ్‌బోర్డులోని మసీదు ముందు వీధిలో స్తంభానికి విద్యుద్దీపం వెలగడం లేదు. - నరసింహారావు
సమాధానం: విద్యుద్దీపాన్ని ఏర్పాటు చేస్తాం. - సూర్యతేజ, కమిషనర్

? సంతపేట గుప్తాపార్కు ముందు చెత్త పేరుకుపోయి దుర్గంధం వస్తోంది. - రమణయ్య
? సీఆర్‌పీ డొంకమార్గంలో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద చెత్త పేరుకుపోయింది. - బాషా
✓ చెత్తను తొలగిస్తాం. - డాక్టర్ చైతన్య, ఆరోగ్యాధికారి

- న్యూస్‌టుడే, నెల్లూరు(టౌన్, నవాబుపేట)

నెల్లూరు అదనపు సీనియర్ సివిల్ జడ్జివారి కోర్టు, నెల్లూరు

E.P. 58 / 2019
O.S. No. 256 / 2010

బెల్లంకొండ మురళి - పిటిషనర్/ డిక్రీ హోల్డర్
Vs.
బెల్లంకొండ అనసూయమ్మ (Died)
బెల్లంకొండ వెంకటేశ్వర్లు,
గంగిశెట్టి సుజాత
- రెస్పాండెంట్స్/ J.D.R.s

వేలం ప్రకటన

ఇందుమూలముగా తెలియపరచుట ఏమనగా పై పేర్కొన్న పిటిషనరు/ డిక్రీహోల్డరు, పై పేర్కొన్న ప్రతివాదులు/ J.D.R.s పైన డిక్రీ పొంది పై పేర్కొన్న E.P. 58 / 2019 అను పిటిషను దాఖలు చేయగా గౌరవనీయ కోర్టు వారు ఈ క్రింది పేర్కొన్న షెడ్యూలు దాఖలా ఆస్తిని వేలం వేసి డిక్రీ మొత్తమును రాబట్టు కొనుటకు **తేదీ: 15.10.24**కి నిర్ణయించినారు. కావున ఆ దినం గౌరవనీయ కోర్టునందు ఈ క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తిని **తేదీ: 15.10.24**న ఉదయం 10.30 గంటలకు వేలం వేయబడునని తెలియపరచడమైనది.

SCHEDULE

SPSR Nellore District, Nellore Registration District, Nellore SRO, Nellore Municipal Corporation Limits, Nellore City, Vedayapalem Area, Survey No. 64/1, Land converted to Layout plots P.R. No. 6, Dt. 2-10-1970, Approved plan plots in Saptagiri Colony, Municipal Ward No. 26-1, Nearest Door No. 1585 an extent of 33 Ankanams 24 sq.feet or 266.66. sq. yards vacant site bounded by: **East:** 33 feet wide Layout Road, Admeasuring 40'-00", **South:** Plot No. 461 site, Admeasuring 60'-00", **West:** Sold of Bhuvanagiri Ramachandraiah Plot No. 99, Admeasuring 40'-00", **North:** Plot No. 459 site, Admeasuring 60'-00".
In this boundaries 33 Ankanams 24 sq.feets or 266.66 sq. yards vacant site and all easementary rights.

DHR Value Rs. 6,00,000/-
Amin Value Rs. 35,00,000/-
Market Value Rs. 36,66,590/-
N. Rupa Kumar
DHR Advocate, Nellore-1